సాక్షి
వైఎస్సార్ జిల్లా
మంగళవారం । 25 । ఫిబ్రవరి । 2025



ఏటీఎం నమూనా సాగు.. రాబడి బాగు

ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు తక్కువ విస్తీర్ణంలో తక్కువ ఖర్చుతో పలు రకాల ఆకుకూరలు, కూరగాయలను సాగు చేసి ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు. - 8లో



అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం చూపాలి

ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలకు త్వరితగతిన నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని జేసీ ఆదేశించారు. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం
35.4 /19.9

వాతావరణం

జిల్లాలో సోమవారం 19.9 - 35.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రత నమోదైంది. గంటకు 2.5 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

పొలతలలో నేటి నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు



విద్యుత్ దీపకాంతులతో ప్రత్యేక అలంకరణలో ఉన్న శివపార్వతులు

పెండ్లిమర్రి : జిల్లాలో ప్రసిద్ధి పొందిన శైవ క్షేత్రాల్లో ప్రముఖమైనది పొలతల క్షేత్రం. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పొలతల క్షేత్రంలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ క్రిష్ణానాయక్ తెలిపారు. క్షేత్రానికి వచ్చేభక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగ కుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఎస్పీ ఆశోక్ కుమార్ పర్యవేక్షణలో రూరల్ సీఐ చల్లని దొర, ఎస్ఐ మధుసూదన్‌రెడ్డిల ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందో బస్తు ఏర్పాటు చేశారన్నారు. బుధవారం చండీ హోమం, పూర్ణాహుతి, రథ ప్రతిష్ఠ,కుంకుమార్చన అనంతరం ఉదయం 10గంటల నుంచి ముత్యాల తలంబ్రాలతో శివపార్వతుల కళ్యాణం, అలాగె రాత్రి 10 గంటలకు రథోత్సవం వైభవంగా నిర్వహిస్తామన్నారు.

అర్హులకు రుణాలిస్తాం

– ఏపీజీబీ ఆర్ఎం శ్రీనివాస్ ప్రసాద్



అరుణాచల ఫుడ్స్‌ను ప్రారంభిస్తున్న ఏపీజీబీ ఆర్ఎం శ్రీనివాస ప్రసాద్, తదితరులు

పులివెందుల టౌన్ : అర్హులైన వారికి వివిధ రకాల వ్యాపారాలు చేసుకునేందుకు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ద్వారా రుణాలు ఇస్తామని ఏపీజీబీ ఆర్ఎం శ్రీనివాస్ ప్రసాద్ అన్నారు. సోమవారం పులివెందుల పట్టణంలోని అమ్మవారిశాల ఎదురుగా అరుణాచల ఫుడ్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీజీబీ ఆర్ఎం శ్రీనివాస ప్రసాద్ మాట్లాడుతూ ప్రధానమంత్రి స్కీం కింద రుణం పొంది వివిధ రకాల వ్యాపారాలు చేసుకునేందుకు బ్యాంకు ద్వారా రుణాలు ఇస్తామని స్పష్టం చేశారు. ఆసక్తి గల వారు ఎవరైనా వ్యాపారాలు చేసుకునేందుకు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకును సంప్రదించాలన్నారు. బ్యాంకుల ద్వారా రుణాలు పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో ఫుడ్ షాపు ప్రొప్రైటర్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కమనీయం..కల్యాణం




మంగళసూత్రాన్ని భక్తులకు చూపుతున్న ఆలయ ప్రధాన అర్చకులు

రాయచోటి టౌన్ : రాయచోటి భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి(రాచరాయుడు) బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో రెండవ రోజైన సోమవారం స్వామివారి కల్యాణం అత్యంత కమనీయంగా సాగింది. స్వామివారి కల్యాణానికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కుటుంబ సభ్యులు పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. వీటిని స్వామి , అమ్మవారికి సమర్పించి తరువాత కల్యాణ వేదిక పైకి తీసుకొచ్చారు. అనంతరం వేదపండితులు నగ్రా వెంకట భాస్కర్‌రెడ్డి (ప్రణవానందగిరి) శిష్యులు మఠం ఓంకార స్వామి ఆచారత్వాన కల్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక భక్తులతో పాటు కన్నడ భక్తులు విశేషంగా తరలివచ్చారు. వీరికి తలంబ్రాలు, ముత్యాలు అందజేశారు. భక్తులకు మన్నూరు రాజశేఖర్, ఆయన భార్య విజయ కుమారి ఆధ్వర్యంలో అన్నదాన ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఈవో డీవీ రమణారెడ్డి, ప్రధాన అర్చకులు కృష్ణయ్య స్వామి, శంకరయ్య స్వామి, రాచరాయ యోగీ స్వామి పాల్గొన్నారు.

ఏసీబీ వలలో అధికారి

రాయచోటి : లంచం తీసుకుంటూ అన్నమయ్య జిల్లా జౌళి శాఖ అధికారి కృష్ణయ్య ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉన్న చేనేత జౌళి శాఖ కార్యాలయంలో తంబళ్లపల్లెకు చెందిన లబ్ధిదారుల నుంచి రూ.70 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేశారు. ఏసీబీ అడిషనల్ ఎస్పీ విజయకుమారి ఆదేశాలతో కడప ఏసీబీ డీఎస్పీ జెస్సీ ప్రశాంతి, సీఐలు కృష్ణయ్య కార్యాలయంపై దాడి చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు. కృష్ణయ్యపై అవినీతి నిరోధక శాఖ కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. పూర్తి స్థాయి విచారణ అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కోర్టుకు హాజరుపరుస్తామని వారు తెలియజేశారు.

శివాయ.. బహు రూపాయ



మహా శివరాత్రికి వేళయింది. మరో రెండు రోజుల్లో రానున్న శుభరాత్రి సందర్భంగా ఇప్పటికే ఆలయాలు అందంగా ముస్తాబయ్యాయి. కొండా కోనల్లోని శైవక్షేత్రాల్లో ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. మన జిల్లాలో పలు శివాలయాలు ఉన్నాయి. దాదాపు అన్ని ఆలయాల్లోనూ శివుడు లింగాకారంలో ఉండడం మనందరికీ తెలిసిందే. కానీ కొన్ని ఆలయాల్లోనూ, ఆలయ ప్రాంగణాల్లోనూ శివుడు విభిన్న రూపాల్లో కనిపిస్తాడు. మహాశివరాత్రి నేపథ్యంలో జిల్లాలోని అలాంటి విభిన్న రూపాలుగల శివుని శిల్పాలు, ఆయా ఆలయాల గురించిన వివరాలతో ప్రత్యేక కథనం.

– కడప కల్చరల్

'నారీ'శ్వరుడు



పెద్దచెప్పలి శ్రీ అగస్తేశ్వరస్వామి గర్భాలయం ఎదుట శివపార్వతులు నందీశ్వరునిపై ఉన్న శిల్పాన్ని మనం చూడవచ్చు. ఇలాంటి శిల్పం జిల్లాలో మరెక్కడా లేదు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ముఖ్యంగా కర్ణాటక భక్తులు ఈ శిల్పాన్ని ఎంతో ఆసక్తితో తిలకిస్తారు. నందిపై శివుడు, పార్వతి ఆశీసులై ఉన్న ఈ శిల్పం ఆలయ విశిష్ఠతను చాటుతోంది. గర్భాలయంలోని శివలింగానికి పూజలు చేశాక అమ్మవారి సమేతంగా నందిపై కొలువై ఉన్న స్వామిని నందీశ్వరుడిని భక్తులు దర్శించుకుంటారు.

'మహా' శివలింగం



మన జిల్లాలో మహా శివలింగం ఉంది. వేముల మండలం మోపూరు భైరవేశ్వరస్వామి ఆలయం ఈ ప్రత్యేకతను కలిగి ఉంది. స్వయంభువుగా పేర్కొనే ఈ శివలింగం 18 అడుగుల ఎత్తుతో తెలుగు నాటి అత్యంత ఎత్తయిన శివలింగాలలో ఒకటిగా ప్రత్యేకతను చాటుకుంటోంది. ఇంత ఎత్తయిన శివలింగానికి పూజలు చేయడం కష్టం గనుక ఆలయాన్ని రెండంతస్తులుగా నిర్మించారు.

నటరాజుగా...



జిల్లాలో కొన్ని శివాలయాల కుడ్యాలపై శివుడు నాటరాజుగా కనిపిస్తాడు. జిల్లాలోని అత్తిరాల పరశురామాలయం కుడ్యాలపై కూడా కనుల విందైన శిల్పాలున్నాయి. వాటిలో నటరాజు కుడ్య శిల్పం ఉంది. శివుడు నటరాజుగా నాట్యం చేస్తున్నట్లు ఒక్కోవైపు ఎనిమిది చొప్పున ఇరువైపుల 16 చేతులు, పక్కనే నందీశ్వరుడు, పార్వతీమాత,సమీపంలో గణపతి తదితరులు ఉండడాన్ని గమనించవచ్చు. ఆలయానికి వచ్చిన భక్తులు ఈ శిల్పాన్ని తప్పక చూస్తుంటారు.

భక్తుల కొంగు బంగారం.. వీరభద్రాలయం



చాపాడు : జిల్లాలో ముఖ్య పుణ్యక్షేత్రాలలో అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి ఆలయం ఒకటి. భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న అల్లాడుపల్లెలోని శ్రీ వీరభద్రస్వామిని కాలజ్ఞాని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి స్వయంగా శిల్పించి ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి పురాతన పర్యాటక ప్రాంతంగా విరాజిల్లుతోంది. అల్లాడుపల్లెలో ఉన్న పురాతన గుడి చరిత్ర, గుడికి సమీపంలో జీవ నది అయిన కుందూనది, విశాల ఆలయ ప్రాంగణం, ఇతర ప్రాంతాల నుంచి సులువుగా చేరేందుకు అనువైన బస్సు రవాణా మార్గం అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవస్థానం ప్రత్యేకత. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రూ.72లక్షలతో ఆలయ జీర్ణోద్ధరణ కావటంతో పాటు, రూ.1.48 కోట్లతో పర్యాటక అభివృద్ధి జరిగింది. దేవస్థాన సన్నిధిలో బుధ, గురువారాల్లో మహా శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ వీరనారాయణ యాదవ్, ఈఓ తెలిపారు.

27న బండలాగుడు పోటీలు..

శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం మధ్యాహ్నం 2గంటలకు రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ తెలిపారు.

అగస్త్యముని ప్రతిష్ఠ

మన జిల్లాలోని పెన్నా తీరంలో అగస్త్య మహర్షి ప్రతి ష్ఠించిన ఆలయాలు ఉన్నాయి. ఆయన ప్రతిష్ఠించిన శివలింగాలకు ఓ ప్రత్యేకత ఉంది. దాన్ని గమనిస్తే ఆ లింగం అగస్త్య మహర్షి ప్రతిష్ఠించినదని అర్థమవుతుంది. ఇలాంటి ఆలయాలు జిల్లాలో దాదాపు 15కు పైగా ఉన్నాయి. అగస్త్యుడు ప్రతిష్ఠించిన శివలింగాల తలపై చిన్న బుడిపె కనిపిస్తుంది. శివుడు తలపై గంగను ధరించడానికి గుర్తుగా అగస్త్యుడు తాను ప్రతిష్ఠించిన శివలింగాలకు ఈ ప్రత్యేకత ఉండేలా చూశాడు. జిల్లాలోని అన్ని అగస్త్యశ్వర ఆలయాల్లోనూ శివలింగం తలపై ఇలాంటి బుడిపెను మనం చూడవచ్చు.

ప్రకృతి ఒడిలో నాగనాథేశ్వరుడు



ఖాజీపేట : చుట్టూ చెట్లు..... ఎత్తైన కొండలు.... కనువిందు చేసే పచ్చని పంట పొలాల నడుమ .. ప్రకృతి ఒడిలో కొలువై ఉన్నాడు నాగనాథేశ్వరుడు. జిల్లాలోని ఖాజీపేట నుంచి 3కిలో మీటర్ల దూరంలో కొండ పైభాగాన నాగనాథేశ్వరుని రూపంలో కొలువై ఉన్న పరమశివుడు భక్తుల ఆరాధ్య దైవంగా అలరారుతున్నాడు. ఇక్కడి నాగనాథేశ్వరుడు స్వయంభూగా వెలిశాడని ప్రతీతి. ఇది ఋషులకు నిలయంగా ఖ్యాతి గాంచింది. కొండ పైన బౌద్ధమతం కు చెందిన ఆనవాళ్లు పరిశోధనలో బయట పడడం విశేషం. మహా శివరాత్రిని పురస్కరించుకుని కొండ దిగువన ఆర్యవైశ్య అన్నసత్రంలో వచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

నేటి నుంచి మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటన

- నేడు పులివెందులలో ప్రజలతో మమేకం
- రేపు వైఎస్ రాజారెడ్డి ఐ సెంటర్‌ను ప్రారంభించనున్న వైఎస్ జగన్



పులివెందుల : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 25, 26వ తేదీల్లో పులివెందులలో పర్యటించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈనెల 25వ తేదీ ఉదయం 10గంటలకు గన్నవరం నుంచి హెలీకాప్టర్ ద్వా రా బయలుదేరి 11.45గంటలకు పులివెందులలోని భాకరాపురం హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటారన్నారు. అక్కడ నుంచి 11.55గంటలకు భాకరాపురంలోని తన నివాసానికి రోడ్డు మార్గాన చేరుకుంటారన్నారు. 12గంటల నుంచి భాకరాపురంలోని తన నివాసంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు అందుబాటులో ఉంటారు. మంగళవారం రాత్రి తన నివాసంలో బస చేస్తారు. ఈనెల 26వ తేదీన బుధవారం ఉదయం 9.50గంటలకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందుల పట్టణంలోని గుంత బజార్‌లో వైఎస్సార్ ఫౌండేషన్, ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ సంయుక్తంగా అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన వైఎస్ రాజారెడ్డి ఐ సెంటర్‌కు చేరుకుని ప్రారంభిస్తారు. 10.45గంటలకు అక్కడ నుంచి బయలుదేరి భాకరాపురంలోని హెలీప్యాడ్‌కు బయలుదేరుతారు. 11గంటలకు భాకరాపురం హెలీప్యాడ్ నుంచి బెంగుళూరుకు బయలుదేరనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

వైవీయూ చెంతకే ఏఎఫ్‌యూ!

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీ మరి కొద్ది రోజుల్లో వైవీయూ చెంతకు చేరనుంది. 2020లో గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలలో తాత్కాలిక భవనాల్లో ప్రారంభమైన విశ్వ విద్యాలయం భవనాల లీజు గడువు 2024 డిసెంబర్‌తో ముగిసింది. కాగా దీనిపై తదుపరి నిర్ణయం తీసుకోవాలంటూ విశ్వ విద్యాలయ వైస్ చాన్సలర్ ప్రభుత్వానికి లేఖ రాశారు. కాగా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సారథ్యంలోని ప్రభుత్వం 2023 లోనే వైవీయూ పక్కన 110 ఎకరాలు భూమిని విశ్వ విద్యాలయానికి కేటాయించిన సంగతి తెలిసిందే. కాగా సోమవారం ఉన్నత విద్యాధికారుల నుంచి వైవీయూ, ఏఎఫ్‌యూ అధికారులకు లేఖ అందింది. ప్రస్తుత ఆర్కిటెక్చర్ విశ్వ విద్యాలయాన్ని వైవీయూ ప్రాంగణంలోని గురుకలం భవనాల్లో నిర్వహించుకునేందుకు అనుమతించాలంటూ లేఖలో పేర్కొన్నారు. విశ్వ విద్యాలయ శాశ్వత భవనాలు నిర్మాణం పూర్తయ్యి.. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఏఎఫ్‌యూను వైవీయూ గురుకుల భవనంలోనే నిర్వహించాలని సూచించారు. దీనిపై ఇరు విశ్వ విద్యాలయాల వీసీలు చర్చించుకుని తదుపరి కార్యాచరణ చేపట్టాలని పేర్కొన్నారు. దీంతో మరి కొద్దిరోజుల్లో ఏఎఫ్‌యూ వైవీయూ చెంతకు చేరనుంది.

కూటమి పాలనపై ప్రజల్లో విసుగు

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను వేధించడమే వారి టార్గెట్
- కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి వ్యాఖ్యలు



మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి

కడప కార్పొరేషన్ : తొమ్మిదినెలల కూటమి పాలనపై ప్రజలు విసుగుచెందారని కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి విమర్శించారు. సోమవారం వైఎస్సార్ జిల్లా కడపలోని 44వ డివిజన్‌లో బాలాజీనగర్‌లో శ్రీసీతారామలక్ష్మణ ఆంజనేయ నవగ్రహ శిఖర ప్రతిష్ఠా మహోత్సవానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, మేయర్ సురేష్‌బాబులతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అవినాష్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం పీఎం కిసాన్ కింద ఇచ్చే రూ.6వేలు కాకుండా...రైతులకు అదనంగా రూ.20వేలు ఇస్తామని చంద్రబాబు సర్కార్ ఎన్నికల్లో హామీ ఇచ్చి 9 నెలలైనా దాని ఊసే ఎత్తడం లేదన్నారు. పులివెందులలో అభివృద్ధి జరగలేదని చెప్పడం హాస్యాస్పదమన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం రూ.300కోట్లు ఖర్చు చేసి మెడికల్ కళాశాల నిర్మిస్తే, కేంద్రం దానికి 50 మెడికల్ సీట్లు మంజూరు చేసిందన్నారు. మంజూరైన సీట్లను మాకొద్దు...అని లేఖ రాసిన చేతగాని ప్రభుత్వం ఇదేనని ధ్వజమెత్తారు. అలాగే రూ.30కోట్లతో కోల్డ్ స్టోరేజీ నిర్మించారని, ప్రభుత్వం యూజర్ ఏజెన్సీని నియమించి దాన్ని ఉపయోగంలోకి తీసుకురాకుండా నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. జిల్లా అభివృద్ధిపై చర్చించాల్సిన డీఆర్‌సీ మీటింగ్‌లో వైఎస్సార్‌సీపీ నాయకుల, కార్పొరేటర్ల వాటర్‌ప్లాంట్లు ఎలా కూల్చి వేయాలన్న దానిపై చర్చిస్తున్నారని ఎద్దేవా చేశారు. డీఆర్‌సీ మీటింగ్ కాస్తా డిస్ట్రిక్ట్ డెమాలిషన్ రివ్యూ కమిటీ మీటింగ్‌గా మారిందన్నారు. వైఎస్సార్‌సీపీ ఆర్‌టీఐ విభాగం జిల్లా అధ్యక్షుడు వి. రామక్రిష్ణారెడ్డి 44వ డివిజన్ కార్పొరేటర్ వి. హేమలత, వైఎస్సార్‌సీపీ పులి సునీల్, ఐస్‌క్రీం రవి, శ్రీరంజన్‌రెడ్డి, త్యాగరాజు, సీహెచ్ వినోద్, కె. బాబు, వేణునాయక్, సుదర్శన్, సుబ్బరాయుడు, షంషీర్, చెన్నయ్య, మల్లికార్జున, శివకోటిరెడ్డి, దేవిరెడ్డి ఆదిత్య, శిరీష, రత్నకుమారి, ఉమామహేశ్వరి, టీపీ వెంకట సుబ్బమ్మ, పత్తిరాజేశ్వరి, మల్లీశ్వరి, పద్మ, శివమ్మ, తులశమ్మ పాల్గొన్నారు.

ప్రజలను అవమానించడమే..

వైఎస్సార్‌సీపీకి 11 సీట్లు వచ్చాయని చులకనగా చూస్తున్నారని, 40 శాతం ఓట్లు వచ్చాయన్న విషయాన్ని కూటమి నేతలు మర్చిపోతున్నారని హెచ్చరించారు. 11 ఎమ్మెల్యే, 4 ఎంపీ సీట్లు ఉన్న వైఎస్సాఆర్‌సీపీ ఒక్కటే రాష్ట్రంలో ప్రతిపక్షంగా ఉందని, దానికి ప్రతిపక్ష హోదా ఇస్తే అసెంబ్లీలో ప్రజల గొంతుక వినిపించేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. అలా కాని పక్షంలో ఎమ్మెల్యేలకు ఇచ్చినట్లు 2 నిముషాల సమయం ఇచ్చి మైక్ కట్‌చేస్తారు...ఆ రెండు నిముషాల్లో ఎవరైనా ఏం చెప్పగలరని ప్రశ్నించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అవమానిస్తున్నామనే భ్రమలో చంద్రబాబు, స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ప్రజలను అవమానిస్తున్నారనే విషయాన్ని మర్చిపోతున్నారని పేర్కొన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి భయపడే వారు ప్రతిపక్ష హోదా ఇవ్వడం లేదన్నారు. ప్రతిపక్షాన్ని గుర్తించండి...ప్రజాస్వామ్యాన్ని కాపాడండి అనే నినాదంతోనే వైఎస్సార్‌సీపీ అసెంబ్లీలో అడుగుపెట్టిందని, ప్రతిపక్ష నాయకుడిగా వైఎస్ జగన్ అసెంబ్లీకి పోతే ఏ రకమైన సినిమా కనబడుతుందో వారికి బాగా తెలుసన్నారు. వాళ్లిచ్చిన హామీలు ఒక్కటి కూడా అమలు చేయలేదని.. దీనిపై వైఎస్ జగన్ మాట్లాడటం మొదలు పెడితే వాళ్ల వద్ద సమాధానం ఉండదన్నారు. దానినుంచి తప్పించుకోవడం కోసమే ప్రతిపక్ష హోదా ఇవ్వడం లేదని ధ్వజమెత్తారు. పులివెందులకు ఉప ఎన్నిక రాబోతోందంటూ ఎమ్మెల్సీ బీటెక్ రవి చేసిన వ్యాఖ్యలపై ఎంపీ స్పందిస్తూ కూటమి గాలిలోనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 65వేల ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారని, ఈ 9నెలల పాలన చూశాక ఇంకెంత మెజార్టీ వస్తుందో అంచనా వేసుకోవాలన్నారు. అంత ముచ్చటగా ఉంటే పులివెందులతో సహా కుప్పం, పిఠాపురం, మంగళగిరి వంటి నాలుగు నియోజకవర్గాల్లో రాజీనామాలు చేయించి ఎన్నికలకు వెళ్దాం...ఈ 9నెలల పాలనకు, సూపర్ సిక్స్ హామీలకు రెఫరెండంగా ఈ ఎన్నికలను పరిగణించుదాం...అప్పుడు ప్రజలు ఎలా తీర్పు చెబుతారో చూద్దామని సవాల్ విసిరారు. కాకమ్మ కబుర్లు, దద్దమ్మ మాటలు మాట్లాడవద్దని హితవు పలికారు.

విశ్వ విద్యాలయ అభివృద్ధికి కృషి

వైవీయూ నూతన ఉపకులపతి ఆచార్య ఫణితి ప్రకాష్ బాబు



వీసీకి అభినందనలు తెలుపుతున్న రిజిస్ట్రార్ పుత్తాపద్మ, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డిలు

కడప ఎడ్యుకేషన్ : అందరి సమిష్టి సహకారంతో విశ్వ విద్యాలయం అభివృద్ధికి కృషి చేయడంతోపాటు విద్యార్థుల ప్రయోజనమే మనందరి లక్ష్యం కావాలని యోగివేమన విశ్వవిద్యాలయం నూతన వీసీ ఆచార్య ఫణితి ప్రకాష్ బాబు పేర్కొన్నారు. సోమవారం ఉదయం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆచార్య ప్రకాష్‌బాబుకు రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ , ప్రిన్సిపల్ ఎస్ రఘునాథరెడ్డి, డీన్లు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు స్వాగతం పలికారు. అనంతరం వీసీ ప్రకాష్ బాబు మాట్లాడుతూ విశ్వ విశ్వవిద్యాలయాన్ని అధ్యయనం చేసి ప్రభుత్వ సహకారంతో నిధులను తెస్తామన్నారు. బోధన పరిశోధన అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ విశ్వవిద్యాలయంలో భాగమైనందుకు తాను చాలా సంతోషంగా ఉన్నానని అలానే గర్వపడుతున్నానన్నారు.

పాలిక మండలి సభ్యులతో బేటీ...

నూతన వీసీగా బాధ్యతలు చేపట్టిన ప్రకాష్‌బాబు పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, ఆచార్య చంద్రమతి శంకర్, డాక్టర్ మాదక్క, కొండపల్లి సుబ్బారావు, ముబీనా భేగం, డాక్టర్ ప్రమోదతో భేటీ అయ్యారు. అలాగే డీన్లు, వివిధ విభాగాల డైరెక్టర్లతో సమావేశమయ్యారు. విద్యార్థుల అభివృద్ధి కోసం ఎలాంటి మార్పులు, నిర్ణయాలు తీసుకునేందుకైనా తాను సిద్ధమన్నారు.

ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లతో.....

విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, సహాయ ఆచార్యులతో వైవీయూ సైన్స్ బ్లాక్ లోని సెమినార్ హాల్లో జరిగిన సమావేశంలో వీసీ ఆచార్య ప్రకాష్ బాబు మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధి అచార్యులుగా మన బాధ్యత అన్నారు. మనం చివరి బెంచ్ విద్యార్థిపై ఎక్కువ దృష్టి నిలపాలి. ఈ సందర్భంగా సిబ్బందిని ఆయన పరిచయం చేసుకున్నారు. వీసీకి శుభాకాంక్షలు తెలిపిన వారిలో పూర్వపు ఇన్‌చార్జ వీసీ ఆచార్య కృష్ణారెడ్డి, ప్రజా సంబంధాల విభాగం సంచాలకులు డాక్టర్ సరిత, వివిధ విభాగాల డీన్లు, అధ్యాపకులు ఉన్నారు.

8 నుంచి ప్యాసింజర్ రైలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : తిరుపతి-హుబ్లి-తిరుపతి (57401/57402) ప్యాసింజర్ రైళ్లు మార్చి 8,9వ తేదీ నుంచి యథా విధిగా నడుస్తాయని రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. కుంభమేళా నేపథ్యంలో ఈ ప్యాసింజర్ రైళ్లను అటు వైపు మళ్లించిన విషయం విదితమే. ఈ రైలు మార్చి 1వ తేది వరకు అటువైపు నడవాల్సి ఉండగా, వాటిని 7వ తేది వరకు పొడిగించారని పేర్కొన్నారు.

చిన్నారుల సమగ్రాభివృద్ధికి తోడ్పడాలి

జిల్లా విద్యాధికారి షంషుద్దీన్



అంగన్వాడీల శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈఓ షంషుద్దీన్

కమలాపురం : అంగన్వాడీ వర్కర్లు శిక్షణలో పొందుతున్న అంశాలను తరగతి గదుల్లో అన్వయించి చిన్నారుల సమగ్ర అభివృద్ధికి తోడ్పడాలని డీఈఓ షంషుద్దీన్ తెలిపారు. స్థానిక జడ్పీ గరల్స్ హైస్కూల్‌లో అంగన్వాడీలకు జరుగుతున్న జ్ఞాన జ్యోతి శిక్షణా కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. శిక్షణలో ఇస్తున్న ఫీడ్ బ్యాక్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ సేవలు చాలా గొప్పవన్నారు. మీరంతా వారం రోజులుగా పొందుతున్న శిక్షణలోని అంశాలను మీ తరగతి గదుల్లో అన్వయించి చిన్నారుల సమగ్ర అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఏపీసీ నిత్యానంద రాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు బేబి, సుభాషిణి, హెచ్ఎం సరస్వతి,డీఆర్‌పీ చంద్ర ఓబుళరెడ్డి, విష్ణువర్ధన్, అనిత, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు, జయ కుమారి, వెంకట సుబ్బమ్మ, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థకు అంగన్‌వాడీ టీచర్స్ కీలకం

ఎర్రగుంట్ల : అంగన్‌వాడీ టీచర్లు విద్యావ్యవస్థలకు మూల స్తంభాలని జిల్లా విద్యాధికారి షంషుద్దీన్ అన్నారు. సోమవారం యర్రగుంట్ల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అంగన్‌వాడీ టీచర్స్‌లకు 120 రోజుల జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాలను తప్పకుండా పాఠశాల స్థాయిలో ఆచరించి పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని తెలియజేశారు. అనంతరం ఎస్ఎస్ఏ ఏపీసీ నిత్యానంద రాజు మాట్లాడుతు పిల్లల అభిప్రాయాలకు విలువ ఇవ్వాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు శివప్రసాద్, రామాంజనేయరెడ్డిలు, కెఆర్‌పీ చంద్ర ఓబుళరెడ్డి, డీఆర్‌పీలు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రావణబ్రహ్మ వాహనంపై భద్రకాళీ సమేత వీరభద్రుడు



రావణ బ్రహ్మ వాహనంపై భద్రకాళీ సమేత వీరభద్రస్వామి

చాపాడు : మండలంలోని అల్లాడుపల్లెలో వెలసిన శ్రీ వీరభద్రస్వామి దేవస్థాన సన్నిధిలో మహా శివరాత్రి ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆరో రోజు బ్రహ్మోత్సవ వేడుకలు నిర్వహించారు. ఉదయం 5గంటల నుంచి 10గంటల వరకూ, అనంతరం సాయంత్రం 5గంటల నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపారు. ఈ క్రమంలో భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామిని రావణ బ్రహ్మ వాహనంపై ఆలయ ప్రాంగణంలో ఆలయ అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తుల నడుమ ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాసులు, ఉత్సవ కమిటీ సభ్యుడు వీరనారాయణ యాదవ్ పాల్గొన్నారు.

తొమ్మిది గడ్డి వాములు దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

వల్లూరు : మండలంలోని దిగువపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని మైసూరారెడ్డి కాలనీలో సోమవారం తొమ్మిది గడ్డి వాములు అగ్నికి ఆహుతయ్యాయి. గ్రామానికి చెందిన తొమ్మిది మంది రైతులు పశువుల కోసం వేసుకున్న గడ్డి వాములకు ప్రమాదవశాత్తూ నిప్పు అంటుకుంది. సమాచారం అందుకున్న కడప, కమలాపురం అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా శ్రమించి మంటలను అదుపు చేశారు.

ఏటీఎం నమూనా సాగు.. రాబడి బాగు



నా పేరు గంగిరెడ్డి. మాది పెండ్లిమర్రి మండలం పగడాలపల్లె గ్రామం. నేను 20 సెంట్లలో ఏటీఎం నమూనాలో ఉల్లి, ముల్లంగి, క్యారెట్‌లతోపాటు గోంగూర, పాలకూర, చుక్కాకు, కొయిటాకు, కొత్తిమీరలను సాగు చేశాను. ఈ పంటల సాగుకు సేద్యం, విత్తనాల, కూలీలు అన్ని కలుపుకుని 5 వేలు ఖర్చు అయ్యింది. మేమే సొంతంగా ఘన జీవామృతం, ద్రవ జీవామృతం తయారు చేసుకుని వాడుకుంటాం. ప్రస్తుతం ఆకుకూరలతోపాటు ముల్లంగి కోతలు ప్రారంభమై రాబడి ఆరంభమైంది. అన్ని ఖర్చులు పోను నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేలు రాబడి వస్తుంది.



నా పేరు ముద్దనూరు షేక్ నుజహత్. ముద్దనూరు మండలం బొందలకుంట గ్రామం. నేను 20 సెంట్లలో ఏటీఎం నమూనాలో 18 రకాల కూరగాయలు, గడ్డ కూరలను సాగు చేశాను. వీటి సాగుకు రూ.4800 ఖర్చు అయింది. ఖరీఫ్ సీజనంతా నెలనెలా దిగుబడి వచ్చి డబ్బులు వచ్చాయి. నేను మా గ్రామంతో పాటు ముద్దనూరు టవున్‌లో వ్యాపారులకు కూరగాయలు, ఆకు కూరలు, గడ్డకూరలను సరఫరా చేశాను. అన్ని ఖర్చులు పోను నెలకు 8 వేల నుంచి 15 వేలదాకా ఆదాయం వచ్చింది.

- అంతర్ పంటల కూరగాయల సాగుతో నిత్యం రాబడి
- రోజువారి ఆర్థిక స్వావలంనే ధ్యేంగా రైతుల అడుగులు
- ఏడాదంతా కాసులపంట.. ఆనందంలో అన్నదాతలు



పెండ్లిమర్రిలో చీనీ తోటలో సాగైన ఏటీఎం నమూనా కూరగాయలు



పెండ్లిమర్రిలో ఏటీఎం నమూనాలో సాగులో ఉన్న ఆకుకూరలు

కడప అగ్రికల్చర్ : వాతావరణంలో నెలకొన్న మార్పుల కారణంగా నేడు వేలకు వేలు ఖర్చు పెట్టి సాగు చేసిన పంటలు పండినా దిగుబడి సమయంలో ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట చేతికొచ్చే పరిస్థితి లేదు. ఉన్నట్టుండి అధిక వర్షాలు కురవడమో లేకుంటే అసలు వర్షాలే కురవకుండా పోవడమో జరుగుతుంది. దీంతో వేలకు వేలు ఖర్చు చేసి రైతన్నలు పంటలను సాగు చేయాలంటే వెన్నులో వణుకు పుడుతోంది. ఈ కారణంగా చాలా మంది రైతులు పంటలసాగుకు అంతగా ఆసక్తి కనబరచడం లేదు. చాలా చోట్ల పంట భూములు బీడులుగా మారుతున్నాయి. అయితే ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు తక్కువ విస్తీర్ణంలో తక్కువ ఖర్చుతో పలు రకాల ఆకు కూరలు, కూరగాయలను సాగు చేసి ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు. అందులోను ఎలాంటి రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకుండా కేవలం కషాయాలతో వీటిని సాగు చేస్తూ పండిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో ఏటీఎం(ఎనీ టైం మనీ) నమూనాలో భాగంగా ప్రతి 20 నుంచి 30 సెంట్లలో 25 రకాలకు పైగా కూరగాయలు, ఆకుకూరలతోపాటు తీగజాతి కాయ పంటలను సాగు చేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకుంటూ కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది జిల్లాలో 180 ఏటీఎంలు సాగులో ఉన్నాయి.

జిల్లాలో పలు మండలాల్లో సాగైన ఏటీఎం నమూనా తోటల సంఖ్య	
కడప	28
ముద్దనూరు	13
మైదుకూరు	19
పోరుమామిళ్ల	38
పులివెందుల	50
ప్రొద్దుటూరు	09
బద్వేల్	12
కమలాపురం	11
మొత్తం	180

సాగు చేసిన 45 రోజుల నుంచే..

ఏటీఎం నమూనాలో సాగు చేసిన పలు రకాల కూరగాయలు, ఆకు కూరలు 45 రోజుల నుంచే దిగుబడి రావడం ప్రారంభమవుతుంది. అనుదినం దిగుబడి సాధించేందుకు స్వల్పకాల పంటలు అయిన ఆకుకూరలు, దుంప పంటలలో ప్రతి నెలకు పంట వచ్చే ముల్లంగి, 2 నెలలకు పంట వచ్చే బీట్‌రూట్, 3 నెలల పంట వచ్చే క్యారెట్ విత్తనాలను వరుసగా ప్రతి నెలా దిగుబడి వచ్చేలా విత్తుకుంటారు. ఈ మూడు దుంపలను ఒకదాటి తరువాత ఒకటి విలీనం చేస్తూ ఒక దుంపను పండించే విస్తీర్ణంలోనే మిగిలిన రెండు దుంపల పంటలను వేసుకున్నారు. ఒకే పంట విస్తీర్ణంలో మూడు పంటలు పండించి మూడు రెట్లు దిగుబడి సాధిస్తున్నారు. దీంతోపాటు 30–40 రోజుల నుంచి దిగుబడి మొదలైన ప్రతి 3 రోజులకు ఒకసారి కోతకు వచ్చే గోరుచిక్కుడు, ఆలసంద పంటలను వేసుకున్నారు. ఈ పంట ప్రతి 70 రోజుల వ్యవధిలో రిలో సోయింగ్(ఇందులో ఒక పంటను పూర్తిగా కోసేందుకు కొంతకాలం ముందు మరో పంటను అదే భూమిలో విత్తడం జరుగుతుంది) ఈ అన్ని రకాల పంటలతోపాటు వంగ, టమాట, మిరప పంటల విత్తనాలను ప్రతి అడుగుకూ ఒక విత్తనం చొప్పున వేసుకోవాలి. ప్రధాన పంటల తరువాత రిలే పంటలుగా పంటల స్థలాలను మార్చుకుంటూ వెళ్లాలి. ఇలా 365 రోజుల పంటలను పండిస్తూ కాసులను పొందుతున్నారు. ఈ రకంగా జిల్లాలో ఏటీఎం నమూనాలో వేముల, వేంపల్లి, లింగాల, పెండ్లిమర్రిలతోపాటు పలు మండలాల్లో పలువురు రైతులు కూరగాయ పంటలను సాగు చేశారు.

ఏయే పంటలను సాగు చేస్తారంటే..

ఏటీఎం నమూనా కింద టమాట, వంగ, మటిక, మిరప, ముల్లంగి, క్యారెట్, బీట్‌రూట్‌లతోపాటు గోంగూర, పాలకూర, మెంతాకు, కొత్తిమీర వంటి ఆకుకూరలు, తీగజాతి కూరగాయలైన బీర, కాకర, సొర, చిక్కుడు వంటి పలు రకాల కూరగాయలను సాగు చేస్తున్నారు. వీటిలో కొన్ని కూరగాయలు సాగు చేసిన 25 నుంచి 30 రోజులకు కోతలు ప్రారంభమవుతాయి. మరి కొన్ని 45 రోజులకు, మరి కొన్ని 90 రోజులకు దిగుబడి వస్తుంది. ఇలా ఏడాదంతా కూరగాయలను పండించుకుంటూ డబ్బులను సంపాదిస్తున్నారు.

ఉన్న ఊరులోనే..

తక్కువ విస్తీర్ణంలో సాగు చేసిన కాయగూరలు, ఆకు కూరలను తాము ఉన్న గ్రామంలోనే మార్కెటింగ్ చేసుకునే అవకాశం ఉంటుంది. మార్కెట్ ధరలకు అనుగుణంగా కిలో చొప్పున వినియోగదారులకు అందిస్తున్నారు. వీటితోపాటు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పురుగు మందులు, రసాయనిక ఎరువులు వాడకుండా కేవలం కషాయలు, జీవామృతం, ఘనామృతంతోనే పండించే కూరగాయలు కావడంతో ప్రజలు వీటిని తీసుకునేందుకు బాగా ఆసక్తి కనబరుస్తున్నారని పలువురు ఏటీఎం సాగు చేసిన రైతులు తెలిపారు.

చాలా ఆసక్తిగా సాగు చేస్తున్నారు..



ఏటీఎం నమూనాలో కూరగాయలు, ఆకుకూరలు సాగు చేసేందుకు చాలా మంది ఆసక్తి చూపుతున్నారు. తక్కువ విస్తీర్ణంలో సాగు కనుక సాగు ఖర్చు కూడా తక్కువగా ఉండటంతో చాలా మంది సాగు చేస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 180 ఏటీఎం నమూనాలను సాగు చేశారు. ఇంకా సాగు చేసేందుకు చాలామంది ఆసక్తి చూపుతున్నారు. మేము కూడా ఆసక్తి ఉన్న వారిని ప్రోత్సహిస్తున్నాం.

- ఎస్‌వీ ప్రవీణ్‌కుమార్, జిల్లా ప్రాజెక్టు అధికారి, ప్రకృతిసేద్యం

ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి

జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్‌బాబు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్‌బాబు

కడప అర్బన్ : జిల్లాలో ప్రజలు పోలీసు శాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్‌బాబు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ ఈ.జి. అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్) కార్యక్రమంలో ఫిర్యాదుదారులతో స్వయంగా ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులకు పోలీస్ సిబ్బంది సహాయం చేసి ప్రశాంతంగా తమ సమస్యను వివరించడానికి సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో డి.టి.సి. డీఎస్పీ అబ్దుల్ కరీం, సిబ్బంది పాల్గొన్నారు.

దిగువపల్లెలో వృద్ధుడి దారుణ హత్య

వేటకొడవళ్లతో నరికిన గుర్తు తెలియని వ్యక్తులు



దారుణ హత్యకు గురైన పప్పూరు గంగిరెడ్డి

లింగాల : లింగాల మండలం దిగువపల్లె గ్రామంలో వృద్ధుడు దారుణ హత్యకు గురయ్యాడు. అరటి పొలంలో సోమవారం ఉదయం పొలం పనులకు వెళ్లిన పప్పూరు గంగిరెడ్డి (73) అనే వృద్ధుడిని గుర్తు తెలియని వ్యక్తులు వేట కొడవళ్లతో దారుణంగా నరికి చంపారని ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. ఉదయం పొలానికి వెళ్లిన గంగిరెడ్డి ఎంతసేపటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఉదయం 11 గంటల ప్రాంతంలో పొలానికి వెళ్లి చూడగా ఆయన దారుణ హత్యకు గురైనట్లు గుర్తించారు. వారి సమాచారం మేరకు ఘటనా స్థలానికి వెళ్లి చూడగా ఆయన గొంతుపైన, తలపైన వేటకొడవళ్ల గాయాలు ఉన్నాయని ఎస్ఐ తెలిపారు. దీనిపై విచారణ చేసేందుకు డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంలు ఘటనా స్థలానికి చేరుకున్నాయన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఏకపక్షంగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వం

ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



అట్లూరు : ప్రజా సమస్యలపై పోరాడుతున్న వైఎస్సార్‌సీపీకి ప్రతిపక్ష హోదా, గౌరవం ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తోందని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ధ్వజమెత్తారు. సోమవాం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సభలో ఉన్నవి రెండే పక్షాలు కనుక వైఎస్సార్‌సీపీని ప్రతిపక్షంగా గుర్తించాలని కోరారు. వైఎస్ జగన్ గుంటూరు మిర్చి యార్డుకు వెళ్లిన తర్వాతే ఈ ప్రభుత్వం రైతుల గురించి ఆలోచించడం మొదలు పెట్టిందన్నారు. అయినా నేటికీ మిర్చి కొనుగోళ్లు చేయడం లేదన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా ఎందుకు మిర్చి కొనుగోళ్లు చేయడం లేదు? ఇలాంటి అంశాలపై మాట్లాడాలంటే ప్రతిపక్ష హోదా ఇవ్వాల్సిందే అన్నారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ అంటూ హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు.

ఆత్మహత్యాయత్నం ఘటనలో ఎస్సీ ఎస్టీ కేసు నమోదు

కొండాపురం : మండల పరిధిలోని అభ్యుదయ మానవ హక్కుల అవగాహన జాతీయ చైర్మన్ రామాంజనమ్మ సోషల్ మీడియాలో తనపై తప్పుడు పోస్టు పెట్టారంటూ మనస్తాపం చెంది విషద్రావణం తాగినట్లు సీఐ మహమ్మద్ రఫీ తెలిపారు. ఆయన కథనం మేరకు తిమ్మాపురం గ్రామానికి చెందిన రామాంజనమ్మ ప్రొద్దుటూరులో ఓ వ్యక్తి దగ్గర ఇంటిస్థలం పట్టా ఇప్పిస్తానని రూ. 60 వేలు తీసుకుంది. పట్టా ఇప్పించలేకపోవడంతో అతనికి తిరిగి రూ. 50 వేలు వెనక్కు ఇచ్చేసింది. మిగిలిన రూ.10 వేలు ఇవ్వకపోవడంతో ఫేస్‌బుక్‌లో పోస్టు చేశాడు. దీంతో మనస్తాపం చెంది ఈనెల 21న కొండాపురం బస్‌స్టాప్ సమీపంలోని టీ దుకాణం వద్ద విష ద్రావణం తాగింది. కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ సంఘటనకు సంబంధించి కొంతమందిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో రూ.12వేలు జరిమానా

చాపాడు : మండల పరిధిలోని ఖాదర్‌పల్లె గ్రామానికి చెందిన బాబా ఫక్రుద్దీన్ అనే వ్యక్తికి డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో కోర్టు రూ.12వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. శనివారం పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీలో భాగంగా చాపాడులో మద్యం తాగి బైక్ నడుపుతున్న బాబా ఫక్రుద్దీన్‌ను పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. సోమవారం కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి ఈమేరకు జరిమానా విధించారన్నారు.

మార్చి 15న మాదిగల సభ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ

ప్రొద్దుటూరు రూరల్ : విజయవాడలో మార్చి 15న లక్ష గొంతుల మాదిగ ఉప కులాల ప్రభంజన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ తెలిపారు. స్థానిక ఎన్‌జీఓ హోంలో సోమవారం జిల్లాలోని ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. షెడ్యూల్డు కులాల వర్గీకరణ చేసుకునే అధికారం రాష్ట్రాలకు ఉందని సుప్రీంకోర్టు ధర్మాసనం 2024 ఆగస్టు 1న తీర్పు ఇచ్చిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వర్గీకరణ అమలు కోసం సీనియర్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను నియమించిందన్నారు. ఈ కమిషన్ మాదిగలు మాలల కంటే తక్కువగా ఉన్నారని ప్రభుత్వానికి తప్పుడు సమాచారం ఇచ్చి తమకు న్యాయ బద్ధంగా రావాల్సిన రిజర్వేషన్లు రాకుండా చేస్తోందని ఆరోపించారు. ఏ ఒక్కరికి అన్యాయం జరగకుండా ఎవరివాటా వారికి దక్కేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డప్పు చర్మకారుల రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం మాదిగ, ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, రాష్ట్ర కార్యదర్శి బాల లక్షుమయ్య, జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణమూర్తి, తిరుమలయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాల్లో వరుస చోరీలు



ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టిన దుండగులు

పులివెందుల రూరల్ : పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లె గ్రామానికి వెళ్లే రహదారిలోని పొలిమేర గంగమ్మ గుడి సమీపంలో మల్లారెడ్డికి చెందిన అరటి తోటలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి అందులోని కాపర్ వైరును ఎత్తుకెళ్లారు. అలాగే రంగనాథ స్వామి గుడి సమీపంలోని బిల్డింగ్ మెటీరియల్‌ను కూడా తీసుకెళ్లారు. తోటల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లనే గుర్తుతెలియని వ్యక్తులు టార్గెట్ చేస్తూ కాపర్ వైరును దొంగిలించి ఎత్తుకెళ్తున్నారు. సుమారు ట్రాన్స్‌ఫార్మర్ విలువ రూ.40వేల నుంచి రూ.50వేలు ఉంటుందని బాధిత రైతు వాపోతున్నాడు. పట్టణ పరిసర ప్రాంతాల్లోనూ వరుస చోరీలు జరుగుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం చూపాలి

జేసీ అదితిసింగ్



ప్రజల అర్జీలను పరిశీలిస్తున్న జేసీ అదితిసింగ్

కడప సెవెన్‌రోడ్స్ : ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలకు త్వరితగతిన నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం సభా భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగా వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అనంతరం అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. విచారణకు కింది స్థాయి అధికారులను పంపకుండా స్వయంగా అధికారినే వెళ్లాలని, అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. తొలుత జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి, జెడ్పీ సీఈఓ ఓబులమ్మ పీజీఆర్ఎస్ దరఖాస్తులపై ఆయా జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు, డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, మెప్మా పీడీ, ఎస్డీసీ వెంకటపతి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం

ప్రతి మహిళ ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన కలిగి ఉండాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల సందర్భంగా 'ఆర్థిక ప్రణాళిక, సేవింగ్ మరియు రిస్క్ మేనేజ్‌మెంట్, ఆర్థిక వృద్ధి కోసం రుణ సదుపాయాలు' అంశాలపై భారతీయ రిజర్వ్ బ్యాంకు వారు ప్రచురించిన కరపత్రాలను జాయింట్ కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు ఈనెల 24వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. డీఆర్ఓ విశ్వేశ్వర నాయుడు, జెడ్పీ సీఈఓ ఓబులమ్మ, మెప్మా పీడీ కిరణ్ పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల విద్యాభివృద్ధికి కృషి

విభిన్న ప్రతిభావంతుల విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అన్నారు. సోమవారం సభాభవన్ వద్ద విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డిగ్రీ లేదా ఆపై తరగతులు చదువుతున్న 13 మంది విభిన్న ప్రతిభావంతులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ లబ్ధిదారులకు ల్యాప్‌టాప్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు అధికారి క్రిష్ణ కిషోర్, సిబ్బంది, లబ్ధిదారుల తల్లిదండ్రులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆశ పడ్డారు.. మోసపోయారు

బంగారు బిస్కెట్ అని నమ్మించి దంపతులకు కుచ్చుటోపీ



కొత్త వ్యక్తులు ఇచ్చిన నకిలీ బంగారు బిస్కెట్

ప్రొద్దుటూరు క్రైం : రూ. 25 లక్షల బంగారు బిస్కెట్‌ను రూ. 5 లక్షలకే వస్తుందంటే ఎవరైనా నమ్ముతారా.. కానీ ప్రొద్దుటూరులోని ఓ దంపతులు ఆశపడి చివరకు నిలువునా మోసపోయారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని దొరసానిపల్లె రోడ్డులో ఉన్న మునిరెడ్డి కాలనీకి చెందిన చిట్టిపోయిన కీర్తి అనే మహిళ జనరల్ స్టోర్ నిర్వస్తుండేది. ఆమె భర్త రామకృష్ణ కొర్రపాడు రోడ్డులోని ప్రైవేట్ సాపులో సేల్స్‌మెన్‌గా పని చేస్తున్నాడు. వారి ఇంటి సమీపంలోని వీధిలో 15 రోజుల క్రితం చేరామని భార్యాభర్తలు ఇరువురు వచ్చి ఆమెను పరిచయం చేసుకున్నారు. తరచూ మాట్లాడుతూ దుకాణంలోని సరుకులు తీసుకెళ్లేవారు. ఈ క్రమంలో ఈ నెల 22న భార్యాభర్తలు దుకాణం వద్దకు వచ్చి మైసూరులో బేల్దారి పని చేస్తున్నప్పుడు తమకు బంగారు బిస్కెట్ దొరికిందని, దాని విలువ ప్రస్తుతం రూ. 25లక్షలు అవుతుందన్నారు. దాన్ని రూ.5 లక్షలకే ఇస్తామని నమ్మబలికారు. అనుమానం ఉంటే చెక్ చేయించుకోండని చెప్పి బిస్కెట్‌లోని కొంత భాగాన్ని రామకృష్ణకు ఇచ్చారు, దాన్ని అతను స్వర్ణకారుడి వద్దకు తీసుకెళ్లి చూపించగా నిజమైన బంగారమేనని చెప్పారు. బంగారు బిస్కెట్‌ను మధ్యలో కట్ చేసి ఒక భాగాన్ని కూడా దంపతులు ఇవ్వగా దాన్ని కూడా పరిశీలించగా బంగారు అని తేలింది. దీంతో గుర్తు తెలియని దంపతులపై రామకృష్ణకు నమ్మకం ఏర్పడింది. రూ. 5 లక్షలు ఇస్తామని బంగారు బిస్కెట్ ఇవ్వమని అడుగగా.. ఈ రోజు శనివారం.. ఉదయం ఇస్తానని చెప్పి అక్కడి నుంచి ఇద్దరు వెళ్లిపోయారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయాన్నే రామకృష్ణ దంపతులు ఫోన్ చేయడంతో దంపతులిద్దరూ ముందు రోజు చూపించిన విధంగా ఉన్న కట్ చేసిన రెండు బంగారు బిస్కెట్ ముక్కలను వారికి ఇచ్చి రూ. 5.20 లక్షలు డబ్బు తీసుకున్నారు. రామకృష్ణ దంపతులు రెండు బంగారు ముక్కలను తీసుకెళ్లి నగలు చేయమని స్వర్ణకారుడికి ఇచ్చారు. అతను వాటిని గోల్డ్ టెస్టింగ్ మిషన్ వద్దకు పంపగా అవి నకిలీవని నిర్ధారణ అయింది. దీంతో వారు దంపతులు ఇచ్చిన నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అని వచ్చింది. మోసపోయామని గ్రహించిన రామకృష్ణ భార్య కీర్తి సోమవారం రాత్రి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పీఎం కిసాన్‌తో అన్నదాతలకు ఆర్థిక చేయూత

కడప అగ్రికల్చర్ : అన్నదాతలకు ఆర్థిక చేయూత అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకాన్ని తీసుకొచ్చిందని ఏపీ స్టేట్ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శశిభూషన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కడప శివార్లలోని ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి 19వ విడత రైతుల ఖాతాలోకి రూ. 2 వేల నగదు జమ ప్రత్యక్ష వీక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. బీహార్ రాష్ట్రంలోని భాగల్పూరులో ప్రధాని నరేంద్రమోడీ 19వ విడత పీఎం కిసాన్ కార్యక్రమాన్ని ప్రారంభించి అన్నదాతల బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేశారు. ప్రత్యక్ష కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన మార్క్‌ఫెడ్ డైరెక్టర్ మాట్లాడారు.